ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వర్‌టైజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం

హౌసింగ్‌బోర్డ్ కాలనీ, జూన్ 28: ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వర్‌టైజ్‌మెంట్ అసోసియేషన్ కరీంనగర్ శాఖ నూతన కార్యవర్గాన్ని నగరంలోని మినీ పద్మనాయక కల్యాణ మండపంలో అసోసియేషన్ సభ్యులు సమావేశమై ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా దండే జనార్దన్ రెడ్డి, అధ్యక్షుడిగా యెలిగేటి కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా గంగుల మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా కొమిరె మల్లయ్యగౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రేణ మల్లయ్య, ఆకుల నాగయ్య, పిచర లక్ష్మణ్ రాజు, సంయుక్త కార్యదర్శులుగా సిరిపురం నాగభూషణం, ముస్కు విద్యాసాగర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కటుకం కేశవ్, బరిగేల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్ లక్ష్మణ్‌రావు, జే సత్యరాజ్, ఎం కుమార్, రాజేశం, శ్రీధర్, అజిజ్, కనకయ్యగౌడ్, ప్రవీణ్ కుమార్, మునీశ్వర్, ఎం చక్రపాణిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడిని రాము యాడ్ ఏజెన్సీ నిర్వాహకుడు రాము సత్కరించారు.

రవాణా శాఖ అధికారుల పెన్‌డౌన్

తిమ్మాపూర్, జూన్ 28: ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్‌కుమార్‌పై గురువారం ఆటో యూనియన్ నాయకుడు దాడి చేయడాన్ని ఖండిస్తూ.. తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ఉదయం 11.30వరకు అధికారులు పెన్‌డౌన్ చేపట్టి నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీటీసీ పురుషోత్తం మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు చోటు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇబ్బంది పడ్డ వాహనదారులు

పెన్‌డౌన్ విషయం తెలియక పలు సేవల కోసం స్లాట్లు బుక్ చేసుకుని కార్యాలయానికి వచ్చిన వాహనదారులు సిబ్బంది కౌంటర్లలో లేకపోవడంతో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. చర్చల అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాలతో అధికారులు సేవలు కొనసాగించారు. పెన్‌డౌన్ దృష్ట్యా సేవలు వినియోగించుకోని వాహనదారులకు సేవలను శనివారం పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. నిరసన కార్యక్రమంలో ఏవో అశోక్, ఏఎంవీఐ స్రవంతి, అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ముట్టడి

కమాన్‌చౌరస్తా, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇందులో భాగంగా, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ మాట్లాడుతూ, ఇష్టారీతిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోలేని డీఈవోను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి భామండ్ల నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజయ్, మధు, ఎస్ఎఫ్ఎస్ జిల్లా ఇన్‌చార్జి నాగరాజు, శ్రీ వర్ధన్, విగ్నేశ్, రాజు, అరుణ్, ఆకాష్, ప్రశాంత్, ఉదయ్ హరి ఓం, విష్ణు, వరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలి

చొప్పదండి, జూన్ 28: పట్టణంలో ఆగిపోయిన సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలని 4వ వార్డు కౌన్సిలర్ చేపూరి హేమ మున్సిపల్ కమిషనర్ నాగరాజు, చైర్‌పర్సన్ గుర్రం నీరజను కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు నిలిచిపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామడుగు, (చొప్పదండి), జూన్ 28: మండలంలోని గోపాల్‌రావు పేటలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రేణికుంట బాబూరాజు తండ్రి రామస్వామి మరణించగా, శుక్రవారం కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. రామస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అల్ఫోర్స్‌లో 'ఫుడ్ షేరింగ్ డే'

ఫుడ్ షేరింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూన్ 28 : కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో శుక్రవారం 'ఫుడ్ షేరింగ్ డే' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమిక దశనుంచే పౌష్టికాహారం అందించాలని, తద్వారా వారు హుషారుగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఆహార పదార్థాలను తీసుకువచ్చిన విద్యార్థులు, తమ ఉపాధ్యాయులు, స్నేహితులతో కలిసి పంచుకొని తిన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

- వానకాలం దృష్ట్యా ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలి
- డ్రైనేజీ క్రిటికల్ గ్యాప్స్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 28: వానకాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వరద నీటితో ఎక్కడా సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. నగరంలో చక్కటి డ్రైనేజీ వ్యవస్థను నిర్మాణం చేసి చాలా వరకు వర్షకాలంలో వచ్చే వరద ముంపు సమస్యను పరిష్కరించామన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం వానకాలం దృష్ట్యా నగరంలో తలెత్తే వరద నీటి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, ఇన్‌చార్జి ప్రపుల్ దేశాయ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తలెత్తిన ముంపు సమస్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో నూతనంగా ప్రధాన స్టాం వాటర్ డ్రైనేజీ నిర్మాణాలు చేయడం వల్ల పెద్దగా వరద నీటితో సమస్యలు రాలేదన్నారు. నగరంలో చేపట్టిన డ్రైనేజీ క్రిటికల్ గ్యాప్స్ వల్ల పలు చోట్ల వరద నీటి సమస్యలు వచ్చాయన్నారు. డ్రైనేజీ నిర్మాణంలో పెండింగ్‌లో ఉన్న క్రిటికల్ గ్యాప్స్‌ను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని టూ టౌన్ సమీపంలో గల ప్రధాన స్టాం వాటర్ డ్రైనేజీలో ఆర్ అండ్ బీ శాఖ నిర్లక్ష్యం కారణంగా సిల్ట్ పేరుకుపోయి పెద్ద సమస్యగా మారిందన్నారు. త్వరలోనే ఆ శాఖ అధికారులతో మాట్లాడి, సంబంధిత సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ప్రధాన స్టాం వాటర్ డ్రైనేజీ గోడలు కూలిపోయిన ప్రదేశాలను గుర్తించి వాటిని పునర్‌నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా వరద నీటితో సమస్యలు తలెత్తితే త్వరగా పరిష్కరించేలా రెండు జేసీబీ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎక్కడ వాటర్ నిలిచినా కచ్చ కాలువలు కొట్టి దగ్గరగా ఉన్న డ్రైనేజీలోకి వరద నీటిని మళ్లించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపా రాణి, ఈఈ యాదగిరి, డీఈలు ఓం ప్రకాశ్, వెంకటేశ్వర్లు, ఏఈలు, పారిశుధ్య విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజల క్షేమమే ధ్యేయం

- పలు చోట్ల ఆర్ అండ్ బీ పాత కల్వర్టుల వల్లే సమస్యలు
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం
- విలేకరుల సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 28: నగర ప్రజల క్షేమమే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తున్నదని, ఈ వానకాలంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీ హరిశంకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ, నగరంలో ఒకే రోజు 10 సెంటీమీటర్ల మేరకు వర్షం కురువడం వల్ల టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని పలు వీధుల్లోని ఇండ్లలోకి నీరు చేరిందన్నారు. సిరిసిల్ల రోడ్డులో టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఆర్ అండ్ బీ శాఖకు చెందిన కల్వర్టు కింద సిల్ట్ భారీగా పేరుకుపోయి రాక్ లాగా మారిందని తెలిపారు. గతంలో ఈ సిల్ట్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయిందని, అలాగే ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టు వల్ల నీటి ప్రవాహం కిందకు వేగంగా వెళ్లడం లేదన్నారు. దీనితోపాటు రాంనగర్, మంచిర్యాల చౌరస్తా, ఆర్‌టీసీ వర్క్‌షాపు, టాటా హాస్పిటల్ ప్రాంతాల్లో ఉన్న కల్వర్టులను సైతం పునర్ నిర్మాణం చేయాలని గతేడాదే ఆర్ అండ్ బీ అధికారులను కోరామని, అయితే ఆ శాఖ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. దీని వల్లే ముకరంపుర ప్రాంతంలో ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కల్వర్టులు పాతవి కావడం వల్లే వానకాలం ఆయా చోట్ల వరద నీటితో ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. ఈ కల్వర్టుల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వానకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించడానికి డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నగరంలో పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే సెల్లార్లు నిర్మించారని, వాటి యజమానులు సెల్లార్లలోకి నీరు పోకుండా చూసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ వానకాలానికి హై లెవల్, లో లెవల్ పరిధిలో సహాయక చర్యల కోసం ప్రత్యేకంగా రెండు జేసీబీలను అద్దెపై తీసుకున్నట్లు తెలిపారు. వానకాలంలో ఎలాంటి సమస్య వచ్చినా నగరపాలక సంస్థ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

'పది' సప్లిమెంటరీలో 96.76 శాతం ఉత్తీర్ణత

కమాన్‌చౌరస్తా, జూన్ 28 : ఇటీవల నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 483 మంది విద్యార్థులకు గానూ 432 మంది పరీక్షకు హాజరుకాగా, 51 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో 418 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. జిల్లాలో 96.76 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. మంచి ఫలితాలు వచ్చేందుకు ప్రత్యేకంగా కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. జిల్లాలో పదో తరగతి లాంగ్ స్టాండింగ్ విద్యార్థులను గుర్తించి, ఈ విద్యాసంవత్సరంలో నిర్వహించే పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా వారిని సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో రాయడం, చదవడంపై ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.

ఆలయానికి వెండి కిరీటాలు అందజేత

గన్నేరువరం, జూన్ 28: ఖాసీంపేట శ్రీ మానసా దేవీ ఆలయంలోని రామ లక్ష్మణ జానకీ హనుమాన్ విగ్రహాలకు గ్రామానికి చెందిన బద్దం మహిపాల్ రెడ్డి, మాధురి రెడ్డి దంపతులు, వారి కుమారుడు విహాన్ రెడ్డి శుక్రవారం నాలుగు కిలోల వెండి కిరీటాలను ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బద్దం చిన్న నరసింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, బద్దం మల్లారెడ్డి, కర్ణ చంద్రయ్య, బద్దం జగ్గారెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, వర్ధన్, కరుణాకర్ రెడ్డి, సంపత్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

చొప్పదండి, జూన్ 28 : రాగంపేటలో 11 లీటర్ల గుడుంబా పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ కరీంనగర్ సీఐ కే నాగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో గుడుంబా అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి, గుడుంబా స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. నిందితులు బాసరవేణి శ్రీనివాస్, ఇస్రాపత్ కేవ్లా నాయక్‌పై కేసు నమోదు చేసి, వారిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

మానకొండూర్ రూరల్, జూన్ 28: చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో సబితా కుమారి తల్లిదండ్రులకు సూచించారు. ఊటూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రోత్ మానిటరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆమె హాజరై మాట్లాడారు. చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లునూర్, సదాశివపల్లెలో పర్యటించిన ఎమ్మెల్యే

కమాన్‌చౌరస్తా, జూన్ 28 : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్లునూర్, సదాశివపల్లి డివిజన్లలో శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అడిషనల్ కలెక్టర్ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సదాశివపల్లి జంక్షన్ ప్రమాదకరంగా మారి రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న క్రమంలో త్వరగా రోడ్డు విస్తరణ చేసి జంక్షన్ నిర్మాణం చేపట్టాలని ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం అల్లునూర్ డివిజన్‌లో డ్రైనేజీ లేక వరద నీరు ఇండ్లలోకి వచ్చి చేరుతుండగా, వెంటనే డ్రైనేజీ నిర్మించాలని మున్సిపల్ అధికారులకు చెప్పారు. అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి హాజరు

తిమ్మాపూర్ రూరల్, జూన్ 28: అల్లునూర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి, శ్రీ రామ సాయి దేవాలయ 13వ వార్షికోత్సవ వేడుకల్లో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారదారవీందర్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు చిందం నర్సయ్య, నాయకులు గోపు మల్లారెడ్డి, బొంతల కల్యాణ్ చంద్ర, సల్ల రాజయ్య, మల్లేశం, ఐతం వెంకన్న, మహేశ్, రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

నేడు విశిష్ట పురస్కారాల ప్రదానం

కమాన్‌చౌరస్తా, జూన్ 28 : సమైక్య సాహితీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా, హుస్నాబాద్‌కు చెందిన ఆచార్య రజనీశ్రీ పురస్కారాన్ని ఆయన తనయుడు, పెద్దపల్లి అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఆధ్వర్యంలో పేరిణి నృత్య కళాకారుడు ప్రకాశ్‌కు ప్రకటించారు. కరీంనగర్‌కు చెందిన కేఎస్ అనంతాచార్య ఆయన తండ్రి కలకుంట్ల సంపత్ కుమారాచార్యులు పేరిట సంగీత పురస్కారాన్ని సంగీత గురువు రామాచారికి, ఆదర్శ ఉపాధ్యాయుడు మాడిశెట్టి మల్లయ్య పేరిట ఆయన కుమారుడు మాడిశెట్టి గోపాల్ ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తక రచయిత గాజుల రవీందర్‌కు, కవి రావికంటి రామయ్య గుప్త పేరిట ఆయన కుమారుడు రావికంటి శ్రీనివాస్ సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ పద్య కవి, అవధాని ముద్దు రాజయ్యకు, డాక్టర్ నాగభూషణం పేరుతో ఆయన కుమారుడు డాక్టర్ రఘురామన్ పరిశోధన రంగంలో కృషి చేస్తున్న తెలంగాణ నవ చరిత్ర పరిశోధకుడు ద్యావనపల్లి సత్యనారాయణకు పురస్కారాలు ప్రకటించారు.

ఈదులగట్టెపల్లి యాదవ సంఘం నూతన కార్యవర్గం

మానకొండూర్ రూరల్, జూన్ 28: మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ యాదవ సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. గ్రామాధ్యక్షుడిగా సంగ చిన్న మల్లయ్య, జనరల్ సెక్రటరీగా జిల్లాల రాజు యాదవ్, కార్యవర్గ సభ్యులను సభ్యులు ఎన్నుకున్నారు.

వయోవృద్ధులకు అండగా ఉంటాం: కలెక్టర్

కలెక్టరేట్, జూన్ 28 : కుటుంబ సభ్యుల ఆదరణకు దూరమై ఇబ్బందులు ఎదుర్కొంటున్న వయోవృద్ధులకు అండగా ఉంటామని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఇక్కట్ల పాలైన సీనియర్ సిటిజన్లను ఆదుకోవాలంటూ ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వయోవృద్ధులకు చట్టం కల్పించిన అవకాశాలు సద్వినియోగమయ్యేలా కృషి చేస్తానని, వారి హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సెంట్రల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, సీనియర్ సిటిజన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు, ఉప్పల లక్ష్మయ్య, ఎలదాసరి లింగయ్య, రామస్వామి, రాజిరెడ్డి, మధుసూదన్‌రావు, జనార్దన్, కె.మల్లారెడ్డి, సిహెచ్. పూర్ణచందర్, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ పథకాలపై కళాకారుల ప్రచారం

తెలంగాణచౌక్, జూన్ 28: ఆర్టీసీ ఉద్యోగులతో కూడిన కళా బృందం సంస్థ ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రచారం చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మీ పథకం గురించి ఆటపాటలతో వివరించారు. కళా బృందం ప్రదర్శనను వీక్షించిన ఆర్ఎం సుచరిత బృంద సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, ఏటీఎం రజినీకృష్ణ, స్టేషన్ మేనేజర్ అంజయ్య, సూపర్‌వైజర్లు వీరస్వామి, కమల పాల్గొన్నారు.

బాలికల కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

తెలంగాణచౌక్, జూన్ 28: నగరంలోని బాలికల జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ డిమాండ్ చేశారు. శుక్రవారం జూనియర్ కళాశాలలను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు కళాశాలల్లో కనీసం మౌలిక వసతులు కల్పించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, శ్రీజ, వినయ్, రాకేశ్, రితిశ్, మౌనిక పాల్గొన్నారు.

'నీట్'పై స్పందించని కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'

తెలంగాణచౌక్, జూన్ 28: నీట్ పేపర్ లీకేజీపై స్పందించని కేంద్ర ప్రభుత్వానికి పోరాటాలతో గుణపాఠం చెబుతామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. కేంద్రం వైఖరికి నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బీజేపీ ఎంపీల ఇండ్ల ముట్టడిలో భాగంగా నగరంలోని కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఇంటి ముట్టడికి బయలుదేరిన మణికంఠరెడ్డిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కాగా, జిల్లా అధ్యక్షుడు మచ్చ రమేశ్‌తో పాటు పలువురు జిల్లా కమిటీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

అలరించిన చిరుతల రామాయణం

తిమ్మాపూర్, జూన్ 28: రామకృష్ణకాలనీ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు గుజ్జుల ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన తాత గుజ్జుల భూంరెడ్డి జ్ఞాపకార్థం చిరుతల రామాయణాన్ని మూడు రోజులుగా ప్రదర్శిస్తుండగా.. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. శుక్రవారం చివరి ఘట్టం నాటక ప్రదర్శనలో ఆంజనేయ భక్త భజన మండలి బృందం కళాకారులు పాత్రలకు జీవం పోశారు. కార్యక్రమంలో గుజ్జుల రవీందర్‌రెడ్డి, మాస్టర్ మాచర్ల నర్సయ్య, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

గాడిదల సంరక్షణ యూనిట్ల పరిశీలన

చిగురుమామిడి, జూన్ 28: మండలంలోని చిగురుమామిడి, ఇందుర్తి గ్రామాల్లో గల గాడిదల సంరక్షణ యూనిట్లను కరీంనగర్, సిద్దిపేట జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు ఉప్పల శ్రీధర్, ఆచార్య జయదేవ్ హర్య శుక్రవారం పరిశీలించారు. చిగురుమామిడిలో నారాయణపురం వెంకటేశ్, ఇందుర్తిలో వేముల రామ్మోహన్ నిర్వహిస్తున్న గాడిదల సంరక్షణ యూనిట్లను పరిశీలించి, వాటికి అందిస్తున్న గడ్డి, వైద్యం ఇతర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకొన్నారు. గాడిద పాలు లీటర్‌కు రూ.1000 నుంచి 1500 వరకు ధర ఉంటుందని, వీటిని సబ్బులు, మందుల తయారీలో వాడతారని నిర్వాహకులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సునీత, డీపీఎంలు ప్రవీణ్, విద్యాసాగర్, ఏపీఎంలు గొడిశాల శ్రీనివాస్ మట్టేల సంపత్, సీసీలు భిక్షపతి, సత్యనారాయణ, వెంకటమల్లు, సంపత్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

చిగురుమామిడి, జూన్ 28: రామంచ గ్రామంలో బీఆర్ఎస్ మహిళా గ్రామాధ్యక్షురాలు సిద్దింకి సారవ్వ ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతికి కారణాలను మృతురాలి కూతురు సువర్ణ, సోదరుడు సిద్దంకి రాజమల్లును అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మండల నాయకులు పెనుకుల తిరుపతి, గ్రామాధ్యక్షుడు గీట్ల తిరుపతి రెడ్డి, నాయకులు ఒంటెల కిషన్ రెడ్డి, గుంటి తిరుపతి, మానేటి మురళీధర్ రెడ్డి, పెర్యాల తిరుపతిరావు, పైసా కనకయ్య, కూన రాజమౌళి, గుంటి తిరుపతి, పైసా కొమురయ్య, పెద్ది సంపత్, రాచకొండ సంపత్, సిద్ధంకి రాజయ్య ఉన్నారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం

సైదాపూర్, జూన్ 28: మండలంలోని బొమ్మకల్ గ్రామంలో నలువాల రాజు(40) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. నలువాల రాజు(40)కు సుమలతతో 23 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు. సుమారు 21 సంవత్సరాల క్రితం హుజూరాబాద్‌లో మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మూడు సంవత్సరాల క్రితం ఆమెను వదిలిపెట్టి మొదటి భార్యతో కలిసి బొమ్మకల్‌లో ఉంటున్నాడు. అప్పుడప్పుడు మద్యం మత్తులో భార్య, కుమారుడితో గొడవ పడుతుండేవాడు. శుక్రవారం ఉదయం భార్య, కుమారుడితో గొడవ పెట్టుకుని ఇంటినుంచి వెళ్లగొట్టగా, వారు గ్రామంలోని పెద్దమనుషుల వద్దకు, అలాగే పోలీస్‌స్టేషన్‌కు వెళ్తామంటూ బయలు దేరారు. కా